
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఆస్పత్రుల్లో అంబులెన్స్‌లేవి..?
జిల్లాలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో అంబులెన్స్‌లు లేక అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందడం లేదు. 8లో



అకాల వర్షంతో పంట నష్టం
జిల్లాలో ఆదివారం రాత్రి వరకు కురిసిన అకాల వర్షంతో వరి, మామిడి, మొక్కజొన్న వంటి పంటలు నేలమట్టమయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 25°

వాతావరణం
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

కొత్తగూడెంటౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సింగరేణి గనుల్లో నీరు చేరింది. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో వరద నీరు నిలవడంతో సోమవారం బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కిష్టారం ఓపెన్‌కాస్ట్‌లో 5వేల టన్నులు, జేవీఆర్ ఓసీలో 20వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు.

కుడా.. ఏదీ మండలి జాడ?

కొత్తగూడెం – పాల్వంచ జంట పట్టణాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించిన కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా).. పాలక మండలి కోసం ఎదురుచూస్తోంది. కుడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి దాదాపు ఆరు నెలలు కావొస్తున్నా ఇంతవరకూ కమిటీ ఊసే లేదు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





పాలకులు లేని కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- కుడా ఏర్పాటుచేస్తూ గతేడాది అక్టోబర్‌లోనే ఉత్తర్వులు
- పాలక మండలిపై మాత్రం దృష్టి పెట్టని ప్రభుత్వం
- అభివృద్ధికి నోచుకోని జంట పట్టణాలు
- చివరి అంకానికి చేరిన కార్పొరేషన్ ఏర్పాటు

అక్టోబర్‌లో ఉత్తర్వులు..
పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 2024 అక్టోబర్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. కుడా ఏర్పాటుతో జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందనే అంచనాలు నెలకొన్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితమే కొత్తగూడెం, పాల్వంచ పూర్తి స్థాయి పట్టణాలుగా రూపాంతరం చెందాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ రెండు పట్టణాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. ఈ రెండు మున్సిపాలిటీలు వేటికవే అన్నట్టుగా ఉండడంతో సమీకృత అభివృద్ధి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులు సైతం వేర్వేరుగా ఉండడంతో ప్రతీసారి రోడ్లు, డ్రెయినేజీలు, సెంట్రల్ లైటింగ్, మరమ్మతు వంటి రొటీన్ పనులే జరుగుతున్నాయి.

రూపురేఖలు మారనున్నాయ్..
గత ఏడాది కాలంగా కొత్తగూడెం – పాల్వంచ పట్టణాల దశ దిశ మార్చే అనేక అంశాలు చోటుచేసుకున్నాయి. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మరోవైపు కొత్తగూడెంలో ఉన్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణగా అప్‌గ్రేడ్ చేశారు. ఆర్గానిక్ ఫార్మింగ్‌లో ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను కొత్తగూడెంలో నెలకొల్పేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. దీనికి తోడు ఇల్లెందు – కొత్తగూడెం హైవే (ఎన్‌హెచ్ 930పీ) పనులు టెండర్ల దశలో ఉండగా కొత్తగూడెం – పాల్వంచకు సంయుక్తంగా బైపాస్ రోడ్డు, ఆటోనగర్, జూపార్కు తదితర ప్రాజెక్టులు ప్రతిపాదనల దశలో ఉన్నాయి. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా కొత్తగూడెం – పాల్వంచల అభివృద్ధికి సంయుక్తంగా ప్రణాళికలు రచించాల్సిన అవసరం నెలకొంది.

కార్పొరేషన్‌గా కొత్తగూడెం..
కొత్తగూడెం – పాల్వంచ పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు 2024 జూన్ 20న విజ్ఞప్తి చేశారు. దీనిపై అనేక తర్జనభర్జనల అనంతరం గత జనవరి 4న జరిగిన కేబినెట్ భేటీలో కొత్తగూడెం కార్పొరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఆ తర్వాత చట్టపరమైన అడ్డంకులు లేకుండా మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కార్పొరేషన్ బిల్లు ఆమోదం పొందింది. కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని నాన్ షెడ్యూల్ గ్రామాలు ఏడింటిని కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రేపో మాపో గెజిట్ కూడా జారీ కానుందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో వడివడిగా అడుగులు పడుతున్నా.. కుడా పాలక మండలి విషయంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది.

నిధులు తెచ్చే 'ప్రణాళిక'..
కుడాకు పాలకమండలి ఏర్పాటైతే దాని పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక, దానికి అవసరమైన నిధులను సేకరించే పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. ఈ రెండు పట్టణాల పరిధిలో వందల ఎకరాల భూములు ఉన్నా.. అవి రెవెన్యూవా లేక అటవీ శాఖవా, షెడ్యూల్ ఏరియానా, నాన్ షెడ్యూల్‌లో సింగరేణి లీజుకు తీసుకున్న భూములా అనేది తేలడం లేదు. ప్రస్తుతం ఉన్న పాలనా విభాగాలు ఈ అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదు. అయితే కుడా లాంటి చట్టబద్ధమైన సంస్థ ఏర్పాటైతే భూముల లెక్కల్లో స్పష్టత వచ్చేందుకు ఆస్కారం ఉంది. పనులు చేపట్టేందుకు అదనంగా ప్లానింగ్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అందుబాటులోకి వస్తుంది. చట్టపరంగా నిధుల సమీకరణ, పెట్టుబడులను ఆకర్షించడం సాధ్యమవుతుంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీలు పని చేస్తుండగా.. కుడా ద్వారా ఇతర అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. తద్వారా ఈ రెండు పట్టణాల ఉమ్మడి అవసరాల ఆధారంగా సరికొత్త ప్రణాళికలు అమలు చేసేందుకు వీలుంటుంది.

సీఎం సమావేశంలో కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి చట్టాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వాన కలెక్టర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఇందులో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీఎం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్

బడుగు వర్గాల ఆశాజ్యోతి.. అంబేడ్కర్

కలెక్టర్ జితేష్ వి పాటిల్ నివాళి



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంటరానితనంతో ఎదురైన అవమానాలనే ఆయుధాలుగా మలుచుకుని ప్రపంచ మేధావిగా ఎదిగిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పాల్గొన్న కలెక్టర్.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. జయంతి రోజునే కాకుండా ప్రతి రోజూ ఆ మహనీయుడిని స్మరించుకోవాలని, అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి అవసరమైన అన్ని హక్కులను రాజ్యాంగంలో పొందుపర్చారని చెప్పారు. అంబేడ్కర్ ఒక వర్గానికి చెందిన వారు కాదని, అందరివాడని అన్నారు. ఆయన సిద్ధాంతాలను నేటి తరాల వారు తెలుసుకోవాలని సూచించారు. సామాజిక రుగ్మతలు అనుభవించి భావితరాల భవిష్యత్‌కు రుగ్మతలు అడ్డుకారాదని హక్కులు కల్పించారని అన్నారు. అంబేడ్కర్ వంటి గొప్ప వ్యక్తి భారతదేశంలో జన్మించడం అందరికీ గర్వకారణమని అన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ.. యువతలో ఉన్న శక్తిని సమాజోద్ధరణకు ఉపయోగించడమే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. ఆయనకు ప్రతీ కుటుంబంలోనూ ఓ అభిమాని ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, సూపరింటెండెంట్ హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఉత్సవ కమిటీ కన్వీనర్ మారపాక రమేష్, కో కన్వీనర్లు కొప్పరి నవతన్ కుమార్, వేమూరి లక్ష్మీబాయి, సంభారపు నాగేందర్, కనుకుంట్ల నిర్మల, ఎం.లక్ష్మీబాయి, భార్గవి, కూరపాటి రవీందర్, బి.పుష్పలత, కుమారస్వామి, కరిసె రత్నకుమారి, ఆర్.మాధవి, జి.కల్పన, ఎం.సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల ఆదరణ పొందాలి

- గిరిజన మ్యూజియాన్ని పరిశుభ్రంగా ఉంచాలి
- ఐటీడీఏ పీఓ రాహుల్



అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ తదితరులు

భద్రాచలం : ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మించిన గిరిజన మ్యూజియం పర్యాటకుల ఆదరణ పొందేలా ఉండాలని పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఆయన మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యాటకులు భారీగా తరలివస్తున్నందున మ్యూజియాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, కళాతృష్ణ ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి, వర్షాకాలాల్లో కళాఖండాలు చెడిపోకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రద్దీ పెరుగుతున్నందున టికెట్ కౌంటర్లను విడివిడిగా ఏర్పాటు చేయాలని, సందర్శకులకు గిరిజన వంటకాలు తాజాగా అందించాలని ఇన్‌చార్జ్ వీరస్వామిని ఆదేశించారు. అధిక ధరలు వసూలు చేయొద్దని, పర్యాటకులకు మరిచిపోని అనుభూతి కల్పించాలని అన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి..
భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పీఓ ఘనంగా నివాళులర్పించారు. ఐటీడీఏ యూనిట్ అధికారులతో కలిసి ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులు, మహిళలు, కార్మిక, కర్షకుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీఈ హరీష్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏసీఎంఓ రమణయ్య, జీసీడీఓ అలివేలు మంగతాయారు, మేనేజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గృహం.. మరింత భారం

- భారీగా పెరిగిన సిమెంట్ ధరలు
- సామాన్యులకు తప్పని ఇబ్బందులు
- ఇందిరమ్మ ఇళ్లపై ప్రభావం పడే అవకాశం



పునాది దశలోనే ఆగిన నిర్మాణ పనులు..

చుంచుపల్లి : పేద, మధ్యతరగతి వర్గాల వారికి సొంతింటి కల సాకారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పది రోజుల వ్యవధిలోనే సిమెంట్ ధరలు అనూహ్యంగా పెరగగా ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాల ఖర్చు తడిసి మోపెడవుతోంది. సిమెంట్‌తో పాటు ఐరన్, ఇసుక ఇతర సామగ్రి ధరలు కూడా అదే బాటలో నడుస్తున్నాయి. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయే ప్రమాదం నెలకొంది. భవన నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని లేక ఉపాధి కరువవుతోంది. ఈనెల 5 నుంచి పెరుగుతున్న సిమెంట్ ధరలు సామాన్యుల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. ఒక్కో బస్తాకు రూ.60 నుంచి రూ.100 వరకు పెరగడంతో ఇంటి నిర్మాణదారులు ఆలోచనలో పడ్డారు. గతంలో ఒక్కో బస్తా రూ.250 నుంచి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.390 నుంచి రూ.400కు చేరింది. అంటే చిన్నపాటి ఇంటికి కూడా ఒక సిమెంట్‌పైనే రూ.40 వేల వరకు అదనపు భారం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు రూ.14 కోట్ల మేర అదనపు భారం పడే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ఇక సీసీ రోడ్ల కాంట్రాక్టర్లు సైతం పనులు మధ్యలోనే నిలిపేసి ముఖం చాటేస్తున్నారు.

వ్యాపారుల్లో మరింత ఆందోళన..
సిమెంట్ బస్తా ధర ఏకంగా రూ.100 వరకు పెరగడంతో వ్యాపారులు సైతం ఆందోళన చెందుతున్నారు. ధరల పెరుగుదలతో క్రయవిక్రయాలు లేక తమకు నష్టం తప్పదని అంటున్నారు. గృహ రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించేవారు పనులను మధ్యలోనే ఆపేస్తున్నారు. ధరలు పెంచుతూ సిమెంట్ కంపెనీలు తీసుకున్న నిర్ణయంతో మధ్య తరగతి వారికే కాక పెద్ద నిర్మాణ సంస్థలకూ షాక్ తగిలినట్టయింది. జిల్లాకు నల్లగొండ, గుంటూరు, కృష్ణా, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి సిమెంట్ సరఫరా అవుతుంది. రిటైల్ వ్యాపారులకు పరిశ్రమల నుంచి ఒక్కో బస్తా రూ.230 నుంచి రూ.300 వరకు అమ్మగా ఇప్పుడు ఆ ధర రూ.390కి చేరింది. ముడి సరుకు ధరలు పెరగడంతో సిమెంట్‌కు కూడా పెంచక తప్పడం లేదని పారిశ్రామికవేత్తలు అంటున్నారు.

ఇసుక, ఇనుముదీ అదే దారి..
గృహ నిర్మాణాలకు సిమెంట్‌తో పాటు ఇసుక, ఇనుము, కంకర వంటి సామగ్రి కొనుగోలు చేయడం తప్పనిసరి. అయితే ధరల పెరుగుదలలో సిమెంట్‌తో పాటు ఇవీ పోటీ పడుతున్నాయి. గతంలో ఒక యూనిట్ కంకర ధర రూ.2,400 ఉండగా ప్రస్తుతం రూ.3,450కి పెరిగింది. ఇసుక ట్రాక్టర్‌కు రూ.2,500 ఉండగా ఇప్పుడు సాధారణ రకం ఇసుక ట్రాక్టర్‌కు రూ.3,400కు చేరింది. అదే క్వాలిటీ ఇసుక అయితే రూ.4 వేల చొప్పున అమ్ముతున్నారు. ఇక టీఎంటీ ఐరన్ టన్ను రూ. 52 వేల నుంచి రూ. 58 వేలకు పెరగగా, వైజాగ్ ఐరన్ అయితే టన్ను రూ.56 వేల నుంచి ఏకంగా రూ.65 వేల వరకు ధర పలుకుతోంది.

ఇల్లు కట్టడం కష్టంగానే ఉంది



సిమెంట్ ధరలు కొంత అనుకూలంగా ఉండటంతో రెండు నెలల క్రితం కొత్తగా ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టాను. ప్రస్తుతం పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో సిమెంట్ ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో మరింతగా భారం పడుతోంది. పనులు కొనసాగించాలా, మధ్యలోనే ఆపేయాలా అనేది అర్థం కావడం లేదు.

– పాంచనపరుపు మహేష్, నిర్మాణదారుడు

అమ్మకాలు తగ్గాయి



ఈ నెల 5 నుంచి సిమెంట్ ధరలు భారీగా పెరిగాయి. దీంతో గృహ నిర్మాణదారులు గతంలో వలె సిమెంట్ కొనుగోలుకు ముందుకు రావడం లేదు. రోజురోజుకూ గిరాకీ తగ్గుతుండగా తీవ్ర నష్టాలు తప్పేలా లేవు. ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోవడంతో కొనేందుకు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు.

– వాసుబాబు, సిమెంట్ షాపు యజమాని

పని అంతగా ఉండటం లేదు



పెరిగిన సిమెంట్ ధరలతో గృహ నిర్మాణదారులు ఇళ్లు కట్టుకోవాలంటే భయపడుతున్నారు. ఇటీవల సిమెంట్, ఇసుక, ఇనుము ధరలు పెరగడంతో నిర్మాణ పనులు అంతగా దొరకడం లేదు. కూలి సైతం గిట్టుబాటు కావడం లేదు. పెంచిన ధరలను తగ్గిస్తేనే మళ్లీ పనులు దొరికే అవకాశం ఉంది.

– ఇంద్ల వీరన్న, తాపీ మేస్త్రీ

పత్తి రైతుపై విత్తన పోటు..

- ఈ ఏడాది ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 పెంపు
- ఆరేళ్లుగా ఏటా పెరుగుతున్న విత్తన ధరలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న దూది రైతులు





జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట(ఫైల్) (ఇన్‌సెట్) పత్తి గింజలు

బూర్గంపాడు: పత్తి రైతుపై ఈ ఏడాది కూడా విత్తన భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వ అనుమతితో పత్తి విత్తనాల ధరలను పెంచుతూ విత్తన కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. 475 గ్రాముల ప్యాకెట్‌పై ధర రూ.37 పెంచాయి. దీంతో ప్యాకెట్ రేటు రూ.901కు చేరింది. ఆరేళ్లుగా పత్తి విత్తనాల ధరలు ఏటా పెరుగుతున్నాయి. ఈసారి పెరిగిన ధరలతో జిల్లాలోని రైతులపై రూ.2.05 కోట్ల అదనపు భారం పడనుంది.

2.20 లక్షల ఎకరాల్లో సాగు
జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న పంటగా పత్తికి మొదటిస్థానం దక్కింది. ఎకరం సాగుకు 2 నుంచి 3 ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయి. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తుండగా, చాలామంది రైతులు ఆ పద్ధతిలోనే పత్తిసాగుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఎకరాకు 3 నుంచి 4 విత్తన ప్యాకెట్లు అవసరమవుతున్నాయి. విత్తనాలు వేశాక వర్షాలు సరిగా కురకవపోతే మళ్లీ తిరిగి విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. జిల్లాలో సుమారు 5 లక్షల విత్తనాల ప్యాకెట్లు ప్రతి ఏటా అవసరముంటున్నాయి. వివిధ కంపెనీల పత్తి విత్తనాలను ఆయా డీలర్ల వద్ద కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఒక్కోసారి కొన్ని కంపెనీల విత్తనాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి రెట్టింపు ధరలకు కూడా కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈ పరిస్థితులు రైతులపై మరింత భారం మోపుతున్నాయి.

ఐదేళ్లలో రూ.171 పెంపు
గడిచిన కొన్నేళ్లుగా పత్తి విత్తనాల ధరలు పెరుగుతున్నాయి. 2020–21లో ప్యాకెట్ ధర రూ.730 ఉండేది. 2021–22కు రూ.767కు చేరింది. 2022–23లో అది రూ.810కి పెరిగింది. 2023–24లో రూ.853కు, 2024–25లో రూ.864కు చేరింది. ఈ ఏడాది 2025–26లో ప్యాకెట్ ధర.901కు పెరిగింది. ఐదేళ్ల వ్యవధిలో పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.171 మేర పెరిగింది. విత్తన ధరలతోపాటు ఎరువులు, పురుగుమందులు, కూలీల రేట్లు ఏటా పెరుగుతుండటంతో పత్తి రైతులపై పెట్టుబడి భారం పెరుగుతోంది. పెరుగుతున్న పెట్టుబడి అనుగుణంగా పత్తి ధరలు పెరగకపోవటం రైతులకు నష్టం కలిగిస్తోంది. గత రెండేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధర దక్కలేదు. దీంతో సీసీఐ రంగంలోకి రైతుల వద్ద నుంచి పత్తిని కొనుగోలు చేయాల్సి వచ్చింది.

రైతుల ఆగ్రహం
పత్తి విత్తనాల ధరల పెంపుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏటా ప్రభుత్వం విత్తనాల ధరలను పెంచేందుకు అనుమతినివ్వటం తమపై భారం మోపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు ఇవ్వకుండా.. ప్రభుత్వాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలను పెంచుకునేందుకు అనుమతులు ఇవ్వటం సరికాదని రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

గత ఆరేళ్లలో విత్తన ధరలు పెరిగిన తీరు(రూ.లలో)

ఏడాది	ధర	పెరిగినది
2020-21	730	---
2021-22	767	37
2022-23	810	43
2023-24	853	43
2024-25	864	11
2025-26	901	37

ఆర్చరీ డెవలప్‌మెంట్ కమిటీలో స్థానం

సభ్యుడిగా పుట్టా శంకరయ్యకు అవకాశం



పుట్టా శంకరయ్య

ఖమ్మం స్పోర్ట్స్: ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ద్వారా దేశవ్యాప్తంగా విలువిద్యకు మరింత ప్రాచుర్యం తీసుకురావడం, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేలా ఎనిమిది మందితో కూడిన డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటుచేసింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి, ఒలింపిక్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్యకు స్థానం దక్కింది. తెలంగాణ నుంచి ఈయనకు మాత్రమే సభ్యుడిగా స్థానం దక్కగా, కమిటీ చైర్మన్‌గా ఏఏఐ ఉపాధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ, కన్వీనర్‌గా సుమంత చంద్ర మహంతి వ్యవహరిస్తారు. సభ్యులుగా శంకరయ్యతో పాటు జంయాంగ్ త్సెరింగ్ నంజ్యాల్(లఢాఖ్), కె.దేవానంద సింగ్(మణిపూర్)తో పాటు ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు సంజీవ్ సింగ్, పూర్ణిమ మహతో, జివాంజోత్ సింగ్ తేజ ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజనులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా తీర్చిదిద్దిన శంకరయ్య.. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్‌లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. విలువిద్యలో సహజసిద్ధమైన ప్రతిభ కలిగి ఉండే గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా కృషి చేశారు. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌కు వ్యాయామ ఉపాధ్యాయులుగానే కాక భద్రాచలం ఐటీడీఏ క్రీడాధికారిగానూ పనిచేశారు.

క్లుప్తంగా

ఓపెన్ బెంచ్ ప్రెస్ పోటీల్లో ప్రతిభ



పాండురాజును అభినందిస్తున్న నిర్వాహకులు

మణుగూరు టౌన్: ఖమ్మంలో ఆదివారం జరిగిన రెండుజిల్లాల స్థాయి ఓపెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో మణుగూరు యువకుడు పర్శిక పాండురాజు ప్రతిభ చూపాడు. గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు జిమ్ ట్రైనర్ నాగరాజు సోమవారం వివరాలు వెల్లడించారు. పాండురాజు గతంలో కూడా రెండు బంగారు పతకాలు సాధించాడని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన



ముదిగొండ : గోకినేపల్లిలో ఆందోళనకు దిగిన రైతులు

తల్లాడ/ముదిగొండ: పదిహేను రోజుల క్రితం ధాన్యం కోతలు పూర్తిచేసి కల్లాల్లో ఆరబెట్టినా కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని రైతులు సోమవారం ఖాళీ పురుగు మందుల డబ్బాలతో నిరసన తెలిపారు. తల్లాడ మండలంలోని కిష్టాపురంలో ధాన్యం సిద్ధం చేసినా గన్నీ సంచులు ఇవ్వడం లేదని, వర్షానికి నష్టపోయే ప్రమాదముందని వారు వాపోయారు. అధికారుల తీరు మారకపోతే ఆత్మహత్య చేసుకుంటామని వెల్లడించగా.. అధికారులు తేమ శాతం తగ్గగానే కాంటా వేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అలాగే, ముదిగొండ మండలం గోకినేపల్లి రైతులు ఖమ్మం–కోదాడ రహదారిపై ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మూడు రోజులైనా కాంటా వేయకపోవడంతో అకాల వర్షానికి నష్టపోయామని తెలిపారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ




విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ

కూసుమంచి/రఘునాథపాలెం: కూసుమంచి మండలంలోని రాజుపేట గ్రామంలో జై భీమ్ బహుజన సంఘం ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాలను సోమవారం రాజుపేట గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ త్యాగనిరతి, దేశానికి వారు అందించిన సేవలను కొనియాడారు. అలాగే, రఘునాథపా మండలం మంచుకొండలో అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అవిష్కరించారు. ఈకార్యక్రమంలో గుత్తా రవి, భూక్యా లక్ష్మణ్‌నాయక్, అజ్మీరా వీరునాయక్, మందా సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

మధిర: వంట పని నేర్చుకోకపోతే ఎలా అని తల్లి మందలించడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధిర శ్రీనగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. మధిరలోని కోల్డ్‌స్టోరేజీలో పనిచేసే యాదగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఈక్షిత(24) వివాహం జరగగా ఆమె కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 16న ఈక్షిత కుమారుడికి అన్నప్రాసన ఉండడంతో వంట పని నేర్చుకోవాలని ఆమె తల్లి మందలించింది. దీంతో క్షణికావేశంలో గదిలోకి వెళ్లిన ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏదో పనిపై వెళ్లి ఉంటుందని భావించిన కుటుంబీకులు కాసేపటికి చూడగా తలుపు గడియ వేసినట్లు గమనించారు. దీంతో తలుపు పగలగొట్టి చూడగా అప్పటికే ఈక్షిత మృతి చెందింది.

వడదెబ్బతో మేకల కాపరి మృతి



హేమ్లా (ఫైల్)

ఇల్లెందురూరల్ : మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ లక్ష్మీనారాయణతండాకు చెందిన మేకల కాపరి బానోత్ హేమ్లా (55) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. మేకలను మేపేందుకు సోమవారం ఉదయం అడవికి వెళ్లిన హేమ్లా మధ్యాహ్నం ఇంటికి వచ్చాక సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. హేమ్లాకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

ఆస్పత్రుల్లో అంబులెన్స్‌లేవి..?

- ఏరియా ఆస్పత్రుల నుంచి బాధితుల తరలింపునకు ఇక్కట్లు
- మండల కేంద్రాల్లో ఉండే 108 వాహనాలపైనే ఆధారం
- అవి గ్రామాలకు వెళ్తుండటంతో సకాలంలో అందని వైద్యం



అంబులెన్సు లేని ఇల్లెందు ఏరియా ఆస్పత్రి

ఇల్లెందు: జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆస్పత్రులకు అంబులెన్స్‌లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మండలానికో 108 వాహనం ఉందని, వాటినే వినియోగించుకోవచ్చనే భావనతో ఆస్పత్రుల అంబులెన్సులను తొలగించారు. వాటి డ్రైవర్లను ఇతర అవసరాలకు ఉపయోగించుకున్నారు. జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, చర్ల ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క ఆస్పత్రికీ అంబులెన్సు సౌకర్యంలేదు. గత పదేళ్ల కాలంగా ఉన్న అంబులెన్సులు కూడా తొలగించారు. ఆయా ఆస్పత్రుల నుంచి అత్యవసర వైద్యం కోసం ఖమ్మం, వరంగల్ వంటి ఆస్పత్రులకు తరలించాలంటే 108 వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రమాద, అనారోగ్య బాధితుల కోసం అవి గ్రామాలకు వెళ్తుండటంతో సకాలంలో ఏరియా ఆస్పత్రులకు రావడంలేదు. దీంతో ప్రైవేట్ అంబులెన్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా రోగులపై ఆర్థిక భారం పడుతోంది.

ప్రాణాలు కోల్పోతున్నారు..

జిల్లా కేంద్ర ప్రధానాస్పత్రి, ఏరియా ఆస్పత్రితోపాటు జిల్లాలో జిల్లాలో 29 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, 376 సబ్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల నుంచి ఏరియా ఆస్పత్రులకు రిఫరల్ పేషెంట్లు వస్తుంటారు. వారికి ఇంకా మెరుగైన వైద్యం అందించేందుకు కొత్తగూడెం, ఖమ్మం తరలించాల్సి ఉంటుంది. 108 వాహనాలు సమయానికి రాకపోవడంతో వైద్యసేవలు అందక ప్రాణాలు కోల్పోతున్నారు. గత శనివారం రాత్రి ఇల్లెందుకు చెందిన లోథ్ కార్తీక్ సోనూ గుండెపోటుతో అనారోగ్యం పాలు కావటంతో ఇల్లెందు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక వైద్యం అందించాక డాక్టర్లు పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. 108కు ఫోన్ చేస్తే అంబులెన్ వచ్చేసరికి గంట దాటింది. దీంతో పరిస్థితి విషమించి బాధితుడు మృతి చెందాడు. అదే ఏరియా ఆస్పత్రికి అనుసంధానంగా అంబులెన్స్ ఉంటే రోగిని సకాలంలో తరలించి ఉన్నత వైద్యం అందించిన ప్రాణాలు కాపాడే పరిస్థితి ఉండేది. ప్రైవేటు అంబులెన్స్‌ల్లో తరలించాలంటే బాధిత కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. ఇల్లెందు నుంచి ఖమ్మానికి తరలిస్తే సుమారు రూ. 4 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇలా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు అందుబాటులో లేక, ప్రైవేటు వాహనాలకు ఖర్చు పెట్టలేక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..



ఇల్లెందు, మణుగూరు, చర్లలో తప్పనిసరిగా అంబులెన్స్‌లు కావాలని కలెక్టర్ దృష్టికి, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏరియా ఆస్పత్రుల నుంచి జిల్లా ఆస్పత్రికి కనీసం 40 నుంచి 60 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఆస్పత్రులకు అంబులెన్స్‌లు ఉంటే సకాలంలో వైద్యం అందించవచ్చు. సీఎస్ఆర్ ఫండ్‌తో మంజూరు చేయాలని లేఖ కూడా అందించాం. ఎంపీ ల్యాడ్స్ నిధుల కోసం ఎంపీలకు కూడా సమస్యను వివరించాం.

–డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్ఎస్

19 తులాల బంగారం రికవరీ

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ

ఇల్లెందు: పోలీసులు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, సొత్తు రికవరీ చేశారు. సోమవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఎన్.చంద్రభాను వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. పట్టణంలోని సివిల్ లైన్ సత్యనారాయణపురం వెళ్లే రోడ్‌లో ఉన్న బి.కుమారస్వామి ఇంట్లో ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున చోరీ జరిగింది. 19 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 5 వేల నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజీ, సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు నిందితుడికి కోసం గాలింపు చేపట్టాయి. సోమవారం పట్టణంలో బుగ్గవాగు సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఓ యువకుడు తారసపడ్డాడు. పోలీసులను గమనించి పారిపోతుండగా పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన రాజ్‌పుత్ కోరీ రాహుల్ చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి సొత్తు రికవరీ చేశారు. అతనిపై గతంలో హైదరాబాద్‌లోని పలు స్టేషన్లతోపాటు ఇల్లెందు, కొత్తగూడెం టూ టౌన్ ప్రాంతాల్లో ఆరు చోరీ కేసులు ఉన్నాయి. సత్వరమే కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు డీఎస్పీ రివార్డు అందజేశారు. సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐలు పఠాన్ నాగుల్ మీరా ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ములకలపల్లి: ఆటో, లారీ ఢీ కొన్న ప్రమాదంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు కథనం ప్రకారం.. వినాయకపురం గ్రామానికి చెందిన శ్రీరాముల రాము, భార్య సీత, కూతురు నాగశ్రీ అమృత, సోదరుడు, మహేశ్‌తో కలిసి ఆటోలో ఈ నెల 6న ములకలపల్లి వైపు వస్తున్నాడు. అదే సమయంలో దమ్మపేట వైపు నుంచి పాల్వంచ వైపు లారీ వెళ్తోంది. ఈక్రమంలో గంగారం అటవీ ప్రాంతంలో ఆటోను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో చిన్నారి నాగశ్రీ అమృతతోపాటు నలుగురికీ స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.


యువకుడి బలవన్మరణం

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగిన యువకుడు సోమవారం మృతి చెందాడు. ఏఎస్సై యాకూబ్ అలీ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లబాడు గ్రామానికి చెందిన గద్దం ప్రసాద్(26) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం కూడా రాజానగరం గ్రామం దగ్గర అతిగా మద్యం తాగి, ఆ మత్తులో పురుగుల మందు తాగాడు. తర్వాత రోడ్డుపై వాంతులు చేసుకుని పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారొచ్చి అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన ఆస్పత్రి వైద్యులు పరిస్థితి విషమించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కిరాణా దుకాణం, ఇల్లు దగ్ధం

మణుగూరు టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, కిరాణ దుకాణం దగ్ధమైంది. మండలంలోని సమితిసింగారానికి చెందిన బోలగాని సమ్మక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట దుకాణం నిర్వహిస్తోంది. ఆమె ఆదివారం రాత్రి 10గంటల సమయంలో దుకాణం మూసివేసి, ఇంటికి తాళం వేసి ఫంక్షన్‌కు వెళ్లింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇల్లు దగ్ధమైంది. ఫ్రిజ్, ఎల్‌ఈడీ టీవీ, కిరాణా సామగ్రి, టేబుళ్లు, దుస్తులు, కౌంటర్‌లోని రూ.50వేల నగదు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య సోమవారం బాధితురాలిని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మిక నాయకుడి మృతి



రాసూరి శంకర్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక నాయకుడు సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సింగరేణి మాజీ ఉద్యోగి, టీబీజీకేఎస్ నాయకుడు, కాంట్రాక్ట్ కార్మిక పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ (58) కొత్తగూడెం నుంచి గౌతంపూర్‌లోని తన ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మరో ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం నుంచి విజయవాడ వైపు ఇద్దరు యువకులు వెళ్తున్నారు. ఈ క్రమంలో ధన్‌బాద్ పోచమ్మ గుడి వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఢీకొట్టారు. దీంతో శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 ద్వారా సింగరేణి ప్రధానాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా శంకర్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడిగా కార్మిక సమస్యల పరిష్కారానికి, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు అనేక పోరాటాలు చేశారు. మృతిపట్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతోపాటు ఎండీ రజాక్ తదితరులు సంతాపం తెలిపారు.

అంతర్‌రాష్ట్ర ముఠాలు వచ్చాయా?

- సత్తుపల్లి చోరీతో అప్రమత్తమైన పోలీస్ శాఖ
- క్లూస్‌టీం ఆధారాలతో గుర్తించినట్లు ప్రచారం

ఖమ్మంక్రైం: జిల్లాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు పోలీసు యంత్రాంగం గుర్తించినట్లు తెలుస్తోంది. ఇటీవల సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌లో భారీ చోరీ జరగగా.. క్లూస్‌టీమ్ సిబ్బందికి లభించిన ఆధారాల ద్వారా ఈ ఘటనకు పాల్పడింది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలేనని గుర్తించినట్లు సమాచారం. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో సంచరించిన ఈ ముఠాలు పలు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కకుండా వెళ్లారు. మళ్లీ ఇప్పుడు అదే ముఠాలు వచ్చినట్లు చూచాయగా గుర్తించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

భారీ చోరీలే లక్ష్యం

అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు వేసవి ప్రారంభం కాగానే రంగంలోకి దిగి ఎంచుకున్న ప్రాంతాల్లో చోరీలు చేస్తుంటారు. ఒకటి, రెండు ఇళ్లు కాక సమూహంగా ఉండే కాలనీలు, అపార్ట్‌మెంట్లను గుర్తించి తాళం వేసి ఉన్న బ్లాక్‌ల్లో ఒకేరోజు చోరీ చేయడం వీరి నైజంగా తెలుస్తోంది. అంతేకాక చోరీ చేయగానే మరో ప్రాంతానికి వెళ్తారని.. ఇందు కోసం రైలు మార్గాలనే ఎంచుకుంటారని సమాచారం. అది సాధ్యం కాకపోతే ముఠా సభ్యులు ఒకరు లేదా ఇద్దరుగా విడిపోయి బస్సులు, ఆటోలు, లారీలలో ప్రయాణిస్తూ ముందు అనుకున్న చోట కలుస్తారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సత్తుపల్లి తెలంగాణ – ఏపీకి సరిహద్దుగా ఉండడం .. బస్సులు, ఇతర వాహనాలు 24గంటలు అందుబాటులో ఉండడంతో ఇక్కడ చోరీకి ఎంచుకున్నట్లు సమాచారం. చోరీ చేశాక ఎవరికీ అనుమానం రాకుండా వాహనాలు మారుతూ వందల కి.మీ. ప్రయాణిస్తాని.. మార్గమధ్యలో గ్రామాల శివార్లలో నిద్రిస్తారని తెలుస్తోంది. ఒకవేళ వీరి స్వస్థలాలను గుర్తించి అరెస్ట్ చేయడానికి వెళ్తే పోలీసులపై దాడులకు సైతం వెనుకాడరని చెబుతున్నారు.

పెట్రోలింగ్ విస్తృతం చేయాలి

జిల్లాలో పోలీస్ పెట్రోలింగ్ విస్తృతంగా పెంచాలని పలువురు కోరుతున్నారు. అనుమానితులు, పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తే చోరీ కేసును ఛేదించే అవకాశముంటుంది. లేనట్లయితే వేసవి సెలవుల్లో అంతా విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్తే ఈ ముఠాలు మరింత చెలరేగే ప్రమాదముంది. కాగా, జిల్లాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలు తిరుగుతున్నాయనే అంశంపై ఓ పోలీస్ అధికారిని వివరణ కోరగా.. సత్తుపల్లిలో జరిగిన భారీ చోరీ ద్వారా ఈ విషయాన్ని చూచాయగా గుర్తించినా స్పష్టత రాలేదని.. త్వరలోనే ఏ ముఠానో తెలుస్తామని వెల్లడించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఏఎస్సై యాకూబ్ అలీ కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు(60) తీవ్ర అస్వస్థతకు గురై కనిపించడంతో స్థానికులు అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో కారు ఢీకొనగా దంపతులకు గాయాలయ్యాయి. బోదులబండకు చెందిన పొట్టపింజర రవికుమార్–భవాని సోమవారం రహదారి వెంట ఉండగా, ఓ కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటలో ఇద్దరికి తీవ్ర గాయాలైనా, కారు యాజమాని తనది తప్పు లేదన్నట్లు ఆపకుండా వెళ్లిపోతున్నాడు. దీంతో స్థానికులు అడ్డుకుని గొడవకుదిగా ఆయన క్షతగాత్రులకు స్థానికంగా చికిత్స చేయించి ఖమ్మం తరలించారు.

మరణంలోనూ వీడని బంధం

భార్య చనిపోయిన గంట వ్యవధిలోనే భర్త మృతి



హనుమరెడ్డి, యశోద (ఫైల్)

నేలకొండపల్లి: పెళ్లినాటి బాసలను ఆయన యాది మరువలేదు. చివరి వరకు పట్టిన చేయి వీడనని ఇచ్చిన మాటను ఆచరించడమే కాక మరణంలోనూ ఆమె వెంటే నడిచాడో భర్త. నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురానికి చెందిన బూధాటి హనుమరెడ్డి(81) – యశోద(76) దంపతులు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. యశోద ఆదివారం ఇంట్లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడగా తలకు బలమైన గాయమైంది. దీంతో ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందింది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటి నుంచి ఆందోళన చెందుతున్న హనుమరెడ్డి.. యశోద మృతి విషయం తెలియగానే గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులను ఆస్పత్రికి తరలించగా గంట వ్యవధిలోనే మృతి చెందాడు. దంపతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా.. ఒకే ట్రాక్టర్‌పై మృతదేహాలను ఉంచి అంతిమయాత్ర నిర్వహించాక అంత్యక్రియలు పూర్తిచేశారు.

వరకట్న వేధింపులతో ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి బలవన్మరణానికి పాల్పడిన నవ్య మృతిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ బ్రాహ్మణ బజార్‌కు చెందిన శ్రీపాద ఉత్తరాచారి పెద్ద కుమార్తె నవ్య(21)కు ఇల్లెందు మండలం ధర్మారం తండాకు చెందిన రవిచంద్రాచారితో గతేడాది డిసెంబర్ 26న వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.50 వేల కట్నం ఇచ్చారు. కాగా, రవిచంద్రాచారి, ఆయన తల్లిదండ్రులు తరచూ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా వారి తీరు మారలేదు. దీంతో నవ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

అకాల వర్షంతో పంట నష్టం



నేలవాలిన వరి పంట



తిప్పనపల్లిలో నేలరాలిన మామిడి కాయలు

దుమ్ముగూడెం : మండలంలోని రామారావుపేటలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. గ్రామంలో సుమారు 60 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. వడగాళ్ల వానకు మిగతా గ్రామాల్లో కూడా పంటనష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గింజలు రాలిపోయాయని పేర్కొన్నారు. గాలి దుమారంతో ఇళ్లపై రేకులు లేచిపోయాయని, విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, తాగేందుకు నీళ్లు లేక చేతి బోరు దగ్గర నుంచి నీళ్లను తెచ్చుకున్నామని గ్రామస్తులు తెలిపారు. చెట్టు విరిగిపడి పంచాయతీ ట్రాక్టర్ కూడా ధ్వంసమైంది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది.

గాలిదుమారంతో రాలిన మామిడి

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లిలో గాలిదుమారం, వడగళ్ల వానతో మామిడి పంట దెబ్బతిన్నది. ఆదివారం రాత్రి వడగళ్ల వర్షం కురియడంతో తోటలోల మామిడికాయలు రాలిపోయాయి. దీంతో పలువురు రైతులు నష్టపోయారు.

శిశుగృహకు కవల ఆడపిల్లలు

దత్తత తీసుకున్న వారి నుంచి స్వాధీనం



తల్లిదండ్రులు, శిశువులతో ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు

చింతకాని: కవల ఆడ శిశువుల అదృశ్యంపై ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. దత్తత తీసుకున్న వారి నుంచి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు శిశువులను చేరదీసి ఖమ్మంలోని శిశుగృహకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన నల్లగాజు మల్లేశ్–ఉమ దంపతులకు గతంలో ఇద్దరు ఆడపిల్లలు ఉండగా గత నెల 31న ఉమ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. దీంతో వారిని పోసించడం భారంగా భావించిన మల్లేశ్.. ఆస్పత్రిలోనే వేర్వేరు కుటుంబాల వారిని దత్తత ఇచ్చాడు. అయితే, శిశువు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసేందుకు వారి ఇంటికి వెళ్లిన ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించగా ఈనెల 11న అధికారులు మల్లేష్ ఇంటికి అధికారులు వెళ్లి విచారణ చేపట్టారు. పిల్లల్ని పోషించలేని స్థితిలో తమ బంధువులకే దత్తత ఇచ్చామని మల్లేశ్ సమాధానం చెప్పాడు. కానీ నిబంధనలకు విరుద్ధంగా దత్తత ఇవ్వడంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా సోమవారం నాటికి శిశువులను తీసుకొస్తానని లేఖ రాసి ఇచ్చాడు.

ఆ కుటుంబాల నుంచి స్వాధీనం

ఆడశిశువులు ఇద్దరిని పిల్లలు లేని తమ దగ్గరి బంధువులకే ఇచ్చామని మల్లేశ్ అధికారులను నమ్మించాడు. ఎట్టి పరిస్థితుల్లో వారిని రప్పించాలని సూచించిన అధికారులు విచారణ చేపట్టగా పిల్లలను ఖమ్మంలోని ఇద్దరు వేర్వేరు దంపతులకు దత్తత ఇచ్చినట్లు తేలింది. ఈక్రమాన డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరిగినా అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఇక సోమవారం దత్తత తీసుకున్న వారి నుంచి శిశువులను మల్లేశ్ దంపతులు తీసుకురాగా, వారి ఇంటికి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు వెళ్లి పిల్లలను పోసిస్తారా, తమకు అప్పగిస్తారా అని ప్రశ్నిస్తే తామే పోషిస్తామని సమాధానం ఇచ్చారు. కానీ ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నందున దంపతులు పోషిస్తారనే నమ్మకం లేకపోవడంతో మల్లేశ్ దంపతులు, శిశువులను ఖమ్మంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. కమిటీ చైర్‌పర్సన్ కౌన్సెలింగ్ ఇచ్చాక శిశువులను శిశుగృహలో ఉంచాలని నిర్ణయించారు.

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం

పోలీసులు సహా పలువురు వేధిస్తున్నారని వెల్లడి

కొణిజర్ల: సంబంధం లేని కేసు విషయమై కొణిజర్ల పోలీసులతో పాటు మరికొందరు వేధిస్తున్నారంటూ మండలంలోని రామనరసయ్యనగర్‌కు చెందిన జె.రవి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండల కేంద్రానికి చెందిన ఓ బాలికను మండలంలోని మల్లుపల్లికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో తీసుకెళ్లాడు. అయితే, రవి ద్విచక్రవాహనాన్ని ఉపయోగించడంతో బాలిక తండ్రి ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ సూరజ్, కొణిజర్లకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి రవికి ఫోన్ చేసి కేసు విషయమై మాట్లాడేందుకు స్టేషన్‌కు రావాలని సూచించారు. కానీ కేసుతో తనకు సంబంధం లేదని, బాలికను తీసుకెళ్లిన యువకుడు తన తమ్ముడి కారు డ్రైవర్‌గా పనిచేస్తాడని తెలిసినా రామనరసయ్యనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు, పోలీసులతో కలిసి వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు రవిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సూరజ్‌ను వివరణ కోరగా బాలికను తీసుకెళ్లిన యువకుడి ఆచూకీ తెలుసుకునే నిమిత్తం స్టేషన్‌కు రమ్మన్నామే తప్ప బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

అసత్య ఆరోపణలు సరికాదు

పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ ఓ ప్రకటనలో తెలిపారు. రామనరసయ్యనగర్‌కు చెందిన రవి వద్ద ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్న వివాహితుడైన ఓర్సు నరసింహారావు బాలికను తీసుకెళ్లగా ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రవి ప్రోద్బలంతోనే నర్సింహారావు తన కుమార్తెను తీసుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొనగా విచారణకు పిలిచామే తప్ప వేధించామని చెప్పడం సరికాదని తెలిపారు.

ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు

మణుగూరు టౌన్: మండలంలోని గుట్టమల్లారంలో సర్వే నంబర్ 49, 33 ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ రాఘవరెడ్డి ఫిర్యాదు చేయగా సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలో గిన్నెల కొట్టు వ్యాపారం నిర్వహించే బేతంచర్ల వెంకటేశ్వర్లు, గోవర్దన్ అనే వ్యక్తులు ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. అందులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న డేగల వెంకట్, కె.రాము, బొడ్డు పుల్లారావు, అబ్రహం, సతీష్, అక్కినపల్లి ప్రదీప్ శాస్త్రిలపై చీటింగ్, ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బేతంచర్ల వెంకటేశ్వర్లు, గోవర్దన్ అనే వ్యక్తులు ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపుతూ విక్రయించారని, ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.